

'పందికోన' ముందుకు సాగేనా..?

- అర్ధాంతరంగా నిలిచిన కుడి, ఎడమ ఆయకట్టు పనులు
- రూ.210 కోట్లు ప్రతిపాదనలకే పరిమితమా..?
- జియో మైసూర్ గోల్డ్ కంపెనీపై పాలకులకు ఎందుకంత ప్రేమ
- కరువుతో అల్లాడుతున్న ప్రజలను ఎందుకు పట్టించుకోరు..?



జియోమైసూరు కంపెనీకి ఏర్పాటు చేసిన స్లూయిజ్

ప్రజాశక్తి-పత్తికొండ

పందికోన రిజర్వాయర్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఐదేళ్లనుంచి నిధులులేక పనులు ముందుకు సాగడం లేదు. వైసిపి తీసుకున్న నిర్ణయం దీనికి మరింత ఆటకంగా మారింది. ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం పనులను వేగవంతం చేస్తామని చెప్పినా నిధులు కేటాయించడంలో స్పష్ట లేదు. కోట్లు రూ.210 కోట్లు కావాలని ఇటీవల పత్తికొండకు వచ్చిన మంత్రి నిమ్మల రామానాయకుడకు అధికారులు తెలిపారు. ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపమని మంత్రి అన్నారు. అధికారులు ప్రతిపాదనలు పంపారు. నిధులొస్తేనే పనులు ప్రారంభిస్తామంటున్నారు. జియో మైసూర్ గోల్డ్ కంపెనీకి నీరు అందిస్తున్నారు. ప్రధాన కాల్వకు స్లూయిస్ ఏర్పాటు చేసి నీటిని తరలిస్తున్నారు. పాలకులకు జియోమైసూరు కంపెనీపై ఉన్న ప్రేమ రైతులపై గాని, తాగునీటికి అల్లాడే ప్రజలపై గాని లేదనే స్పష్టంగా తెలుస్తుంది. ఈనేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక కథనం ....

కర్నూలు జిల్లాలోని అత్యంత వెనుకబడిన నియోజకవర్గం పత్తికొండ ప్రాంతానికి సాగు, తాగునీరు అందించాలని ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పత్తికొండ మండలం కొత్తపల్లి - పందికోన గ్రామాల మధ్య 1800 ఎకరాల భూమిని సేకరించి పందికోన రిజర్వాయర్గా ఏర్పాటు చేశారు. 2010-2011 కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో రైతులకు సాగు, తాగునీరు ఇవ్వాలని కుడి ,ఎడమ ఆయకట్టు పనులకు ప్రారంభించారు. 2018-19 సంవత్సరంలోని టిడిపి ప్రభుత్వ హయాంలోని కుడి, ఎడమ ఆయకట్టు పనులను కొంతమేరకు జరిగాయి. పెండింగ్ పనులను పూర్తి చేయకుండా పంట కాలువలకు సాగునీరు వదిలారు. 2019-2020 వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే జీవో 365 తీసుకొచ్చింది. గడిచిన ఐదేళ్ల లో కుడి, ఎడమ ఆయకట్టు పెండింగ్ పనులలు ముందుకు సాగలేదు. 2024-25 కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్ట్ విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. కుడి ,ఎడమ ఆయకట్టు పెండింగ్ పనులపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టి సకాలంలో పంట కాలువలకు సాగునీరు ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అరకొర సామర్ధ్యంతో పందికోన రిజర్వాయర్

కొత్తపల్లి -పందికోన గ్రామాల మధ్య 1800 భూమి సేకరించి పందికోన రిజర్వాయర్ ఏర్పాటుచేసి 1.216 టిఎంసి నీరు నింపాలి. 0.9 టిఎంసి నింపుతున్నారు. పూర్తి సామర్థ్యంతో నీటిని నింపితే కుడి, ఎడమ ఆయకట్టుకు నీరు అందించవచ్చని అధికారులు చెబుతున్నారు. వైసిపి ప్రభుత్వం ప్రభుత్వం 2020లో జీవో 365ను తీసుకొచ్చింది. పెండింగ్ పనులు ముందుకు సాగలేదు. కుడి కాలువ 37 కిలోమీటర్ల మేరకు కొత్తపల్లి వెలమకూరు, కుంకునూరు, దేవనకొండ కరివేముల, కప్పట్రాళ్ల, తెర్నేకల్లు, ఎర్రపాడు గ్రామాల పొలాల మీదుగా కాలువ పనులు జరగాలి. సుమారు 50,626 ఎకరాలకు గాను 13,860 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుంది. 36,766 ఎకరాలకు సాగునీరు అందడం లేదు.

ఎడమ కాలువ ఆయకట్టు పనులు

పందికోన రిజర్వాయర్ ద్వారా 9.5 కిలోమీటర్ల మేరకు పత్తికొండ, దూదేకొండ ,కోతిరాల, ముత్తుకూరు, మండగిరి, జూటూరు గ్రామాల పొలాలకు 10,774 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. 5,142 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

జియో మైసూర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి పుష్కలంగా నీరు

హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా మద్దికేర మండలం ఎడవల్లి గ్రామం దగ్గర తూము ద్వారా తుగ్గలి మండలం జొన్నగిరిలో జియో మైసూర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి సాగునీరు తీసుకెళు తున్నారు. పంట పొలాలను పండించుకోవడానికి సాగునీరు ఇవ్వడం లేదంటూ ప్రభుత్వంపై రైతులు మండిపడుతున్నారు. జొన్నచెరువు నింపిన తరువాత జియోమైసూరు కంపెనీటికి నీళ్ళు తీసుకు పోవాలని ఉంది. నీళ్ల నింపే 68 చెరువులలో ఇది కూడా ఒకటి. కంపెనీయాజమాన్యం మాత్రం మాకు నీళ్ల సరిపోవు చెరువుకు వదిలేది లేదంటుంది. ఇక్కడ అధికారులు ఎందుకు చొరవ తీసుకోలేదో అర్థం కావడం లేదు. ముడుపులకు లొంగార, రైతుల కన్నీటి కష్టాలు కనబడుట లేదా? ..

హంద్రీనీవాకు స్లూయిజ్‌లు ఏర్పాటు చేయాలి

హంద్రీనీవాకు పత్తికొండ మండలం హోసూరు గ్రామం దగ్గర స్లూయిజ్ ఏర్పాటుచేసి హోసూరు, చిన్నహల్తి, పెద్దహల్తి, నలకదొడ్డి, జుటూరు, ముత్తుకూరు మీదుగా 10,000 ఎకరాలకు సాగునీరు గాజుల దీన్నే ప్రాజెక్టు చేరుకుంటుంది. హంద్రీ నీవాకు గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ-మాచాపురం వరకు సాగునీరు ఇవ్వాలని పంట కాల్వల నిర్మాణం చేపట్టి 46 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని.. పెండింగ్ లో ఉన్న కప్పట్రాళ్ల-పాలకుర్తి -తెర్నేకల్ గ్రామాల మధ్య పెండింగ్ లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలి.


కుడి, ఎడమ ఆయకట్టుకు రూ. 210 కోట్ల ప్రతిపాదనలు

- హెచ్ఎన్ఎస్ఎస్ ఎఇ నజీర్

కుడి ,ఎడమ ఆయకట్టు నిలిచిపోయిన పనులకు రూ.210 కోట్లు అవసరమని ఈనెల 8న పత్తికొండకు వచ్చిన జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేయాలని అన్నారు. ప్రతిపాదనలు పంపాం. నిధులొస్తే పనులు ప్రారిభిస్తాం.

పంట కాలువలపై ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలి

- ఎపి రైతు సంఘం జిల్లా నాయకుడు రంగారెడ్డి



కుడి, ఎడమ ఆయకట్టు పనులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వెంటనే పనులు ప్రారంభించాలి. పత్తికొండ మండలం హోసూరు, దేవనకొండ మండలం గుండ్లకొండ దగ్గర స్లూయిజ్‌లు ఏర్పాటు చేయాలి. బీడు భూములకు సాగునీరు అందించి, పంట కాలువలను సకాలంలో పూర్తి చేయాలి. లేనిపక్షంలో రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

నిలిచిపోయిన పిల్ల కాలువ పనులు ప్రారంభించాలి

- ప్రభాకర్‌రెడ్డి, మండగిరి సర్పంచి



పందికొన రిజర్వాయర్ నుండి ఎడమ కాలువ ఆయకట్టు రాతన మునెప్ప పొలం దగ్గర నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేసి నీరు విడుదల చేయాలి. అలా చేస్తే మండగిరి, అగ్రహారం, చిన్నహుల్తి, జూటూరు పంట పొలాలకు సాగునీటితో పాటు గ్రామాలకు తాగునీరు కూడా అందించవచ్చు.

బిసిలు ఆర్థికంగా ఎదిగేందుకే రుణాలు

- రూ.50 కోట్లు నిధులు మంజూరు
- 2,223 యూనిట్లు జిల్లా లక్ష్యం
- మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ
- ప్రజాశక్తితో బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకీర్ హుస్సేన్



ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

బిసి సామాజిక కులాల ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా బ్యాంకు లింకేజీ రుణాలను బిసి కార్పొరేషన్ ద్వారా అందజేస్తున్నామని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. జిల్లాకు రూ.50 కోట్లు మంజూరయ్యాయని, 2,223 యూనిట్లు జిల్లా లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు..

బీసీ సామాజిక తరగతులు ఆర్థికంగా ఎదిగేందుకు ఎలాంటి పథకాలను అమలు చేస్తున్నారు?

ఈడీ : బీసీలు ఆర్థికంగా సొంత కాళ్లపై నిలబడి జీవించేందుకు వీలుగా స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం బ్యాంకు లింకేజీ రుణాలను ప్రవేశపెట్టింది. ఇప్పటికే ఈ పథకం కింద జిల్లాలో ప్రజలు రుణాల కోసం ఆన్లైన్ ద్వారా దరఖాస్తులను చేసుకున్నారు. ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

జిల్లాలో ఎన్ని యూనిట్లు లక్ష్యంగా రుణాల మంజూరుకు ఉపక్రమించింది?

ఈడీ : జిల్లాలో మొత్తం 2,223 మంది లబ్ధిదారులకు బిసి కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వ లక్ష్యంగా విధించింది. అందుకోసం కర్నూలు జిల్లాకు ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసింది.

రుణాల కోసం జిల్లాలో మొత్తం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

ఈడీ : దరఖాస్తులు స్వీకరణ గడువు ముగిసేనాటికి మొత్తం 29,270 దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తుదారులు నమోదు చేసుకున్నారు. వీటిని ఆయా మండలాల పరిధిలో ఎంపీడీవోలు, కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ శాఖ అధికారులు వివిధ బ్యాంకు అధికారులతో కలిసి పరిశీలిస్తారు. అర్హులైన వారి దరఖాస్తులను రుణాల మంజూరు కోసం బీసీ కార్పొరేషన్ కార్యాలయానికి సబ్సిడీ కోసం సిఫారసు చేస్తారు.

ఇప్పటి వరకు ఎవరెవరి లాగిన్లను ఎన్ని దరఖాస్తులు చేరాయి?

ఈడీ: ప్రస్తుతం ఎంపీడీవోల నుంచి బ్యాంకులకు 1966, బ్యాంకుల నుంచి ఎంపీడీవోలకు చేరినవి 754, ఎంపీడీవోల నుంచి ఈడి లాగిన్ కు చేరినవి 638, ఈడీ లాగిన్ నుంచి కలెక్టర్ లాగిన్‌కు పంపినవి 510, కలెక్టర్ లాగిన్ నుంచి ఎండి బీసీ కార్పొరేషన్ లాగిన్‌కు 459 దరఖాస్తులు చేరాయి. దరఖాస్తుదారులకు ప్రభుత్వం త్వరలోనే సబ్సిడీని దరఖాస్తుదారుల ఖాతాలకు జమ చేయనుంది.

ప్రత్యేకంగా మహిళల స్వయం ఉపాధి కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?

ఈడీ : మహిళల ఆర్థిక స్వావలంబన సాధికారత లక్ష్యంగా స్వయం ఉపాధి కల్పించే దిశగా బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. ఏప్రిల్ 20వ తేదీ నుంచి ఏపీఓబిఎంఎంఎస్ ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించాం.

ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు ఎలాంటి లబ్ధిని చేకూర్చనున్నారు?

ఈడీ : ఈ పథకానికి ఎంపికైన మహిళలకు 90 రోజులపాటు ఉచితంగా ఆయా మండలాలు అర్బన్ మున్సిపాలిటీ కేంద్రాల్లో ఉచితంగా కుట్టు శిక్షణను ఇవ్వడమే కాకుండా వారికి ఉచితంగా కుట్టు మిషన్ ను కూడా పంపిణీ చేస్తున్నాము. జిల్లాలో మొత్తం 3440 కుట్టు మిషన్లు పంపిణీ చేసేందుకు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇందులో నియోజకవర్గానికి 500 కుట్టుమిషన్లను కేటాయించాం.



ఆలూరు కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ దారుణ హత్య

- టిప్పర్‌తో కారును ఢీ కొట్టి - వేట కొడవళ్లతో నరికి

ప్రజాశక్తి - ఆలూరు



ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి చిప్పగిరి లక్ష్మినారాయణ(58) గుంతకల్లులో ఆదివారం దారుణ హత్యకు గురయ్యారు. గుంతకల్లులోని ఆలూరు రోడ్డులో రైల్వే బ్రిడ్జి వద్ద దుండగులు చేతిలో మారణాయుధాలతో దాడిచేసి హతమార్చారు. ఈ ఘటనకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా చిప్పగిరి లక్ష్మినారాయణ గతంలో ఎంఆర్‌పిఎస్ నాయకుడిగా ఉండేవాడు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు మద్దతుగా పనిచేశాడు. ఈ నేపథ్యంలో ఎన్నికల అనంతరం ఆలూరు నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జిగా పని చేస్తున్నారు. అయితే లక్ష్మినారాయణకు గుంతకల్లులో ఎక్కువ పరిచయాలు ఉన్నందున ఆయన ఆలూరులో కాకుండా ఎక్కువ శాతం గుంతకల్లులో ఉండేవాడు. గుంతకల్లులోని ఎల్లమ్మతగ్గ ఏరియాలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని అక్కడి నుండి దళితుల సమస్యలపై పనిచేసేవాడు. ఈ నేపథ్యంలో యధావిధిగా ఆదివారం కూడా ఆయన తన కుమారుడు వినోద్, అన్న కుమారుడు కరెంటు గోవిందు కలసి స్కార్పియోలో గుంతకల్లు నుంచి ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఆలూరుకు బయలుదేరాడు. గుంతకల్లు పట్టణ శివారులోని ఆలూరు రైల్వే బ్రిడ్జి వద్ద ముందుగానే కాపుకాసిన దుండగులు టిప్పర్‌తో అతని వాహనాన్ని ఢీకొట్టారు. అప్పటికే అక్కడ పోలాల్లో కాపుకాసిన కొందరు విచక్షణారహితంగా మరణాయుధాలతో లక్ష్మినారాయణపై దాడి చేశారు. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు వినోద్, అన్న కొడుకు గోవిందు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. హత్య సమయంలో అక్కడి పొలాల్లో పనిచేస్తున్న కూలీలు గట్టిగా కేకలు వేయడంతో తాము ప్రాణాలతో బయటపడ్డామని బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని హత్యకు కారణాలు దర్యాప్తులో తెలియాల్సుందని పోలీసులు తెలిపారు.

మృతుడు ఓ హత్యకేసులో నిందితుడు : ఇదిలా ఉండగా 2006 నవంబర్ నెలలో ఆలూరులోని వైకుంఠం శ్రీరాములు దంపతుల హత్య కేసులో మృతుడు లక్ష్మీనారాయణ, కరెంటు గోవిందు 7వ నిందితులుగా ఉన్నారు. లక్ష్మినారాయణ హత్యకు వారే కారణమై ఉంటారని బంధువులు ఆరోపిస్తున్నారు.

ప్రాణ హాని ఉందని ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు

- కరెంట్ గోవిందు

మా చిన్నాన్న లక్ష్మినారాయణకు ప్రాణ హాని ఉందని ఎన్నోసార్లు పోలీస్ ఉన్నంతధికారులను కలిశాం. హోంమంత్రి దృష్టికి కూడ తీసుకెళ్ళాం. వైకుంఠం శ్రీరాములు కుమారులైన మల్లికార్జున, శివప్రసాద్‌ల నుంచి ప్రమాదం పొంచి ఉన్న విషయం పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళాం.

రాయల్‌స్పోర్ట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి కబర్ధి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

క్రీడాకారులు కొత్తగా నిర్మించిన రాయల స్పోర్ట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి కబర్ధి పేర్కొన్నారు. ఆదివారం మిలిటరీ కాలనీ సమీపంలో రాయల స్పోర్ట్స్ క్లబ్‌ను జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి కబర్ధి, తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీదేవి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి మాట్లాడుతూ... రాయల స్పోర్ట్స్‌ను కర్నూలులో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాయల స్పోర్ట్స్ ను రాయల్ గా నడిపించాలన్నారు. జిల్లాలోని క్రికెట్ క్రీడాకారులు దీనిని సద్వినియోగం చేసుకావాలన్నారు. క్రీడాకారులు నైపుణ్యాన్ని పెంచుకోవడానికి ఇది ఒక మంచి అవకాశం అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రికెట్ ఆటలో బాగా రాణించి కర్నూలు జిల్లాకు మంచి పేరు తేవాలని జడ్జి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పై.రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలో ఆదివారం రాయల స్పోర్ట్స్ క్రికెట్ గ్రౌండ్‌ను ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు ఈ స్టేడియంను వినియోగించుకొని మంచి నైపుణ్యం సాధించి, క్రికెట్‌లో రాణించాలన్నారు. ఈ కాంప్లెక్స్ లో స్విమ్మింగ్ పూల్ కూడా నిర్మించి, ఒక స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా తయారవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రక్కనే ఉన్న ఈ స్థలం దాదాపుగా ఐదు ఎకరాల 50 సెంట్లు భూమిని ఎంసి బీచ్‌పల్లి, వారి సోదరులు ,వారి కుటుంబ సభ్యులు చక్కగా తీర్చిదిద్దడాన్ని అభినందించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఈ రాయల స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం వలన క్రికెట్ క్రీడాకారులకు మంచి అవకాశమన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రికెట్‌లో మంచి నైపుణ్యం సంపాదించుకోవాలని క్రీడాకారులకు సూచించారు.

ఉత్సాహంగా క్రికెట్ ఆడిన కలెక్టర్, ఎస్పీ

రాయల స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన అనంతరం, కలెక్టర్, ఎస్పీ క్రికెట్ ఆడారు. ఇరు జట్లకు నాయకత్వం వహించి ఉత్సాహంగా క్రికెట్ ఆడి యువతలో స్ఫూర్తి నింపారు.. క్రికెట్ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కర్నూల్ ఆర్‌డిఓ సందీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డిఎస్‌డిఓ భూపతి పాల్గొన్నారు.



రాయల్ స్పోర్ట్స్‌ను ప్రారంభిస్తున్న జడ్జి కబర్ధి, కలెక్టర్ రంజిత్ బాష

విద్యుద్ఘాతంలో బండల కార్మికుడు మృతి

ప్రజాశక్తి-సి బెళగల్



విద్యుద్ఘాతానికి బండల డిపోలో పనిచేస్తున్న కార్మికుడు బోయకాలేప్ప మృతిచెందారు. మండలంలోని బురాన్ దొడ్డికి వ్యక్తి బోయ కాలేప్ప (55) బండల డిపోలో దినసరి కార్మికుడిగా సి బెళగల్ లోని గూడూరుకు చెందిన బాషా అనే డిపోలో పనిచేస్తున్నారు. యజమాని, రైతు కలిసి దగ్గర లోని స్తంభం దగ్గర విద్యుత్ చౌర్యం యథేత్సగా చేయసాగారు. అది కూడా వైర్‌ను సుమారు 120 అడుగుల పైనే లాగుకొని అక్కడక్కడా జాయింట్లు కూడా ఉన్నాయని ప్రమాదం పొంచి ఉందని, చౌర్యం తగదని విద్యుత్ అధికారులు, సిబ్బంది గతంలోనే హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం కార్మికుడు కాలేప్ప మూత్ర విసర్జన చేసేందుకు వెళ్లగా అక్కడే ఈ చౌర్యం వైరు తలకు తగిలి విద్యుద్ఘాతానికి మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. న్యాయం చేసేంత వరకు మతదేహం కదలనివ్వబోమని బంధువులు, కుటుంబికులు నిరసన తెలిపారు. ఎఎస్ఐ తిమ్మప్ప సంఘటనపై తగు దర్యాప్తు చేపట్టారు

ఎర్రమట్టి అక్రమ రవాణా ట్రాక్టర్ల పట్టివేత

ప్రజాశక్తి-సి బెళగల్

ఎర్రమట్టి అక్రమ రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఎఎస్ఐ తిమ్మప్ప ఆదివారం పట్టుకున్నారు. అడ్డదారిలో సొమ్ములు చేసుకునేందుకు అధికార పార్టీకి చెందిన కొందరు కార్యకర్తలు ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టి రవాణా చేస్తున్నారని. తగదని ఏ ఎఎస్ఐ హెచ్చరించారు. సిబెళగల్ కు చెందిన నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకోని ఎర్రమట్టి ట్రాలీని, ఎర్రమట్టిని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

ఉగ్రవాదుల దాడులను ఖండించండి: సిపిఎం

ప్రజాశక్తి-గూడూరు : జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో భార తీయ పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని యావత్ ప్రపంచమంతా ఖండించాలని సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జె.మోహన్ అన్నారు. కాశ్మీర్లో ని పెహల్గాం ఉగ్రదాడి ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గూడూరు పాత బస్టాండు సెంటర్లో కొవ్వొత్తులతో నిరసన తెలిపి, దాడిలో చనిపోయిన వారికి నివాళు లర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు , రంగన్న అధ్యక్షత న కార్యక్రమం నిర్వహించారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నేటి ర్యాలీని జయప్రదం చేయండి

ముస్లిం జెఎసి కన్వీనర్ సయీద్ జాకీర్ మౌలానా పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : నేడు జరిగే బహిరంగ ర్యాలీని జయప్రదం చేయాలని జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ జాకీర్ మౌలానా రష్ది పిలుపునిచ్చారు. మసీద్ ఏ రిసల్‌దార్ ఆవరణలో మీడియా సమావేశం నిర్వహించారు. సయ్యద్ జాకీర్ మౌలానా , కోకన్వీనర్లు ,ఎస్ఎండి షరీఫ్, ఎంఎ.హమీద్, జయరాజు లు మాట్లాడుతూ సోమవారం ఉదయం 9 గంటలకు ఇస్లామియా అరబ్బీ కాలేజ్ గ్రౌండ్ నుండి ర్యాలీ శాంతియుతంగా సామరస్యంగా కొనసాగడానికి ముస్లిం యువకులతో పాటు హిందూ ,క్రైస్తవ సోదరులు సహకరించాలని, పెద్ద ఎత్తున ఈ నిరసన ర్యాలీలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టాన్ని రద్దు చేయాలని, తక్షణమే సవరణలు వెనక్కి తీసుకోవాలని, పాత చట్టాన్ని కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొని రావాలన్నారు. దానికి మన కర్నూలు నగర ప్రజానీకం, కులమత ప్రాంత భేదాలు లేకుండా ముక్తకంఠంతో ఈ చట్టాన్ని వెనక్కి తీసుకొనేలా బిజెపి ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొని రావాలన్నారు. దానికి మన కర్నూలు ర్యాలీ నాంది పలకలదని, ఈ ర్యాలీ చట్టానికి లోబడి ఇతర ప్రజానీకానికి వ్యాపారస్తులకు ఎటువంటి అంతరాయం లేకుండా ఇబ్బంది కలగకుండా మనమందరం సహకరించుకోవాలని కోరారు. ఈ ర్యాలీలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక,కర్షక, సోదరులందరు, కలిసి రావాలన్నారు. హిందూ, ముస్లిం,సిక్ , ఈ సాయి సబ్ కే సబ్ భాయి భాయి అనే నినాదంతో ర్యాలీ సాగుతుందని పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న ముస్లిం జెఎసి కన్వీనర్ సయీద్ జాకీర్ మౌలానా

'కురువ' విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

మే 5లోపు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ : ఇంటర్, టెన్త్ అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులయిన ఉమ్మడి జిల్లా కురువ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కుదరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కురువ సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం కర్నూలు నగరం లోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో కురువ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఇవ్వాలని నిర్ణయించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా కురువ సంఘం గౌరవాధ్యక్షులు కె. కిష్టన్న,జిల్లా అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న,ప్రధాన కార్యదర్శి ఎం. కె.రంగస్వామి మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీలీలమ్మ, ప్రదానకార్యదర్శి అనిత తదితరులు మాట్లాడుతూ పదవ తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు 500పైగా, ప్రైవేటు పాఠశాలల్లో చదివిన వారు 550 పైన మార్కులు వచ్చిన వారు అప్లయ్ చేయాలన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులు 850 మార్కులు, ప్రైవేటు కళాశాల చదివిన విద్యార్థులు 900 మార్కులకు పైగా వచ్చిన విద్యార్థులు తమ మార్కుల మెమోను, కులం సర్టిఫికెట్, జిరాక్స్ కాపీని మే5లోగా వాట్సప్ నెంబర్లకు 9440756199, 9032741194 పంపాలని కోరారు.

బీమా రంగంలో 100శాతం విదేశీ పెట్టుబడి వద్దు

ఎల్ఐసి ఉద్యోగుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బీమా రంగంలో విదేశీ కంపెనీల పెట్టుబడులను పూర్తిగా వ్యతిరేకిస్తూ, ఎల్ఐసి ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మే 20న దేశవ్యాప్త సమ్మెకు ఎల్ఐసి ఉద్యోగుల సంఘం పిలుపునిచ్చింది. ఈ సమ్మెను విజయవంతం చేయాలని సంఘం జాతీయ ఉపాధ్యక్షులు పి. సతీష్ పిలుపునిచ్చారు. కర్నూలు ఎల్ఐసి ప్రధాన కార్యాలయంలో డివిజన్ జాయింట్ సెక్రటరీ సునీయ కుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృత సమావేశంలో సతీష్ మాట్లాడుతూ ఐఆర్‌డిఎ సంస్థ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, ఎల్ఐసిని బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

ఎల్ఐసి ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు: అందరికీ పెన్షన్, పెన్షన్ అప్‌డేషన్, స్టాగ్నేషన్ ఇంక్రిమెంట్ అమలు చేయాలి.కొన్ని అలవెన్సుల విషయంలో ఉద్యోగులపై చూపుతున్న వివక్షను తొలగించాలి.ఎల్ఐసీలో తక్షణమే కొత్త నియామకాలు చేపట్టాలి. సాధారణ బీమా సంస్థలను విలీనం చేయాలి. బీమా ప్రీమియంపై తక్షణమే రద్దు చేయాలి. కార్మిక చట్టాల నిర్వీర్యాన్ని ఆపాలి. 80శాతం పైగా సభ్యత్వం ఉన్న ఎఐఐఇఎ కు తక్షణమే గుర్తింపు ఇవ్వాలి. ఈ డిమాండ్ల సాధన కోసం మే 20న జరిగే సమ్మెలో బ్యాంకు సిబ్బంది, ఇతర కార్మిక వర్గాలు పాల్గొని విజయవంతం చేయాలని సతీష్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ. రఘునాథ రెడ్డి, నాయకులు అక్బర్‌బాష, శ్రీనివాసులు, రవిబాబు, అంబుజా సింగ్, కర్నూలు, ఆదోని, ఆత్మకూరు, బనగానపల్లి, డోన్, ఎమ్మిగనూరు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. అంతకుముందు, కర్నూలు ఎల్ఐసి బ్రాంచ్ ఆఫీసులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పి.సతీష్ ప్రారంభించారు. పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ, దేశ సమగ్రతను కాపాడుకోవాలని సతీష్ పిలుపునిచ్చారు. మృతుల కుటుంబాలకు ఇన్సూరెన్స్ మొత్తాలను తక్షణమే చెల్లించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ నాయకులు సతీష్



గుత్తిపెట్రోల్ బంక్ పిస్తాహౌస్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

కేంద్ర ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నగరంలోని పలు హోటల్స్‌పై ఆహార కల్తీ నియంత్రణ అధికారుల ఆకస్మికంగా తనిఖీలను చేపట్టారు. ఈమెరకు ఆదివారం స్థానిక అధికారులతో పాటు కేంద్రఫుడ్ సేఫ్టీ ఆడిటర్ మిశ్రా విస్తృత తనిఖీలు చేపట్టారు. తనిఖీలు కర్నూలు నగరం, గుత్తి రోడ్డులో ఉన్న పిస్తాహౌస్, ఒటిజి హోటళ్ళలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా హోటల్లో వినియోగదారులకు అందిస్తున్న ఆహార నిల్వలను తయారీ విధానాన్ని హోటల్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ తెలిపారు.

ఆహార కల్తీ కేసుల్లో రూ.1.25 లక్షలు జరిమాన: ఇటీవల జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష ఆదేశాల మేరకు... కల్తీ ఆహార నిలువలపై, అమ్మకాలపై జిల్లా పరిధిలో వివిధ ప్రాంతాల్లో నమోదైన కల్తీ కేసులకు సంబంధించి సేకరించిన శాంపిల్స్‌లో కల్తీ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో కేసు ఫైళ్లను జాయింట్ కలెక్టర్ కోర్టుకు శనివారం సమర్పించిన 10 ఆహార కల్తీ కేసులకు సంబంధించి కల్తీదారులకు రూ.1,25,000 అపరాధ రుసుంను విధిస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య తీర్పు వెలువ రించారని ఎఎస్‌పి కుర్మా నాయకులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ తెలి పారు. ఆహార కల్తీకి పాల్పడితే కేసును నమోదు చేస్తామని వారు హెచ్చరించారు.

పత్తికొండలో గాలివాన బీభత్సం

గంటపాటు ఉరుములు మెరుపులతో వర్షం-ఇండ్లు, చెట్లు నేలకొరిగి...

ప్రజాశక్తి-పత్తికొండ



పత్తికొండ మండలంలో పత్తికొండ , హోసూరు, పుచ్చకాయల మాడ, పెద్దహల్తి, చిన్న హల్తి, జూటూరు, దూదేకొండ, మండగిరి గ్రామీణ ప్రాంతాలలోని 4.8 మిమి వర్షపాతంతో ఉరుములు, మెరుపుల, గాలివాన బీభత్సంతో చెట్లు, రేకుల షెడ్లు ,మట్టి మిద్దెలు నేలకుఒరిగాయి. హోసూర్ గ్రామంలోని మూలింటి సంజప్ప (53) మట్టి మిద్దె కుప్ప కూలింది. సంజాప్ప మాట్లాడుతూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు కూలిపోవడంతో కన్నీరు మున్నీరయ్యారు. ఎవరికి ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ప్రభుత్వం స్పందించి సంజప్ప కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయాలని పలువురు కోరుతున్నారు


ఆర్‌టిసి బస్టాండ్‌లో ఆర్‌ఎం తనిఖీలు

ప్రజాశక్తి-కోసిగి


బస్టాండ్ పరిసరాలను పరిశీలిస్తున్న ఆర్‌ఎం

ఆర్‌టిసి బస్టాండ్‌ను కర్నూలు ఆర్‌ఎం టి.శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ చలపతి ఆదివారం తనిఖీ చేశారు. ముందుగా బస్టాండ్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రయాణికులకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తామన్నారు. తనిఖీల్లో భాగంగా ఆదోని, కోసిగి ఆర్‌టిసి బస్టాండ్లను పరిశీలించామని తెలిపారు. మండల స్థాయిలో భాగంగా కార్గో సర్వీస్ పార్శిల్ పాయింట్ ప్రారంభించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ సర్వీస్ ద్వారా హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ వంటి నగరాలకు సులువుగా వస్తువులను పార్శిల్ ద్వారా ఆర్‌టిసితో పంపవచ్చని తెలిపారు. ఔత్సాహికులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలన్నారు. ఆర్‌టిసి బస్టాండ్ వెనుక ఖాళీ స్థలంలో సైకిల్, స్కూటర్ల పార్కింగ్‌కు కేటాయిస్తామని తెలిపారు. ఆర్‌టిసి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బంకుల ద్వారా బస్సులు కట్ కాకపోవడంతో డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. వెంటనే ఆర్‌టిసి డ్రైవర్లకు ఇబ్బందులు లేకుండా బస్సులు సునాయాసంగా ప్రాంగణంలో వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. ఆర్‌టిసి బస్టాండ్‌లో తాగడానికి నీరు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, కూర్చోవడానికి కుర్చీలు, నేమ్ బోర్డు వంటివి ఏర్పాటు చేస్తామని తెలిపారు. బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. కర్నూలుకు, కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు బస్సు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరారు. ఆదోని డిపో మేనేజర్ రఫీక్, సిబ్బంది శ్రీనివాసులు పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : సిఐటియు


మాట్లాడుతున్న సిఐటియు మండల కార్యదర్శి రాముడు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సంఘటిత, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు కోరారు. ఆదివారం సివిల్ సప్లయి లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీ కార్మికుల సమావేశం నిర్వహించారు. రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడారు. శారీరక పనులు చేస్తున్న హమాలీ రంగ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి సంక్షేమ పథకాలూ ఇవ్వడం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు ప్రతిసారీ హమాలీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామని హామీ ఇస్తారని, నేటికీ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని మండిపడ్డారు. కార్మికులు సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం వల్ల హమాలీ కార్మికులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ చట్టాల వల్ల కార్మికులకు నష్టం వాటిల్లుతుందని చెప్పారు. దేశవ్యాప్తంగా కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను అమలు చేసే విధంగా మే 20న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె జరుగుతుందని తెలిపారు. హమాలీ కార్మికులు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'సంక్షేమం' చేపట్టలేక వైసిపిపై సాకులు

- వైసిపి నాయకులు విరుపాక్షి రెడ్డి

ప్రజాశక్తి - నందవరం


మాట్లాడుతున్న వైసిపి నాయకులు విరుపాక్షి రెడ్డి

సంక్షేమాన్ని అమలు చేయలేక గత వైసిపి ప్రభుత్వంపై సాకులు చెబుతూ కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని వైసిపి బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరుపాక్షి రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా ప్రజా సంక్షేమాన్ని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వైసిపి పాలనలో జగన్మోహన్ రెడ్డి అర్హతను ప్రమాణంగా తీసుకొని, పార్టీలకతీతంగా 13 లక్షల మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసి పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, కొత్తగా ఒక్క పింఛను కూడా మంజూరు చేయకుండా, ఉన్న పింఛన్లలో దాదాపు 1.6 లక్షల పింఛన్లను రద్దు చేశారని చెప్పారు. ఈనెల 24న విడుదల చేసిన తాజా సర్క్యులర్ ద్వారా 'స్పౌజ్ పెన్షన్' పేరుతో కొత్త నిబంధనలు విధించడం ద్వారా అనేక మంది వితంతువులు అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. భర్త మరణించిన తర్వాతే భార్యకు పింఛను మంజూరు చేస్తామన్న నిబంధన వల్ల, ఇప్పటికే భర్తను కోల్పోయిన అనేక మంది మహిళలు న్యాయం నుంచి దూరమయ్యారని చెప్పారు. వైసిపి నాయకులు గణపతి, దాదా, రాజశేఖర్, బాబయ్య పాల్గొన్నారు.

భారీ వర్షం...

- పిడుగు పడి ఇద్దరు మృతి
- నీటిలో కొట్టుకుపోయిన వరి ధాన్యం
- రైతుల కష్టం నీటిపాలు
- కన్నీరు మున్నీరవుతున్న రైతులు


తడిసి ముద్దయిన వరి ధాన్యం


నీటిలో మునిగిన వరి పంట

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని నదీచాగి, కాత్రికి గ్రామాలపై ప్రకృతి కన్నెర్రజేసింది. ఆదివారం రెండు గ్రామాల్లో ప్రజలు కన్నీరు పెట్టారు. కాత్రికి గ్రామంలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ గ్రామానికి పక్కనే ఉన్న నదీచాగి గ్రామంలో కురిసిన భారీ వర్షానికి వరి ధాన్యం మునిగి పోయి, వర్షపు నీటిలో మరి ధాన్యం కొట్టుకుపోయింది. ఈ రెండు సంఘటనలు పక్కపక్క ఉన్న గ్రామాల్లో చోటు చేసుకున్నాయి.

తుంగభద్ర నది ఒడ్డున ఉన్న నదీచాగి గ్రామంలో వరి పంట సాగు చేసిన రైతులు పంటను కోసి ధాన్యాన్ని పొలాల్లోనే నిల్వ చేశారు. మద్దతు ధర లేకపోవడంతో చాలామంది రైతులు మరి ధాన్యం పొలాల్లోనే ఉంది. మరి కొంతమంది రైతులు పంటను కోసి (కల్లం) వ్యవసాయ పనుల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి రైతుల కళ్ల ముందే పంట నీటి పాలవుతున్నా రక్షించుకోలేని దుస్థితిలో రైతులు దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. నాలుగు నెలలు కష్టపడి పండించిన పంట, చేతికి వచ్చిన ధాన్యం కళ్ల ముందే వర్షపు నీటి ప్రవాహంలో కొట్టుకు పోతుంటే రైతులు కన్నీరు మున్నీరయ్యారు.

కష్టం నీటి పాలు

- రైతు వలీ బాష



రైతులు కష్టపడి పండించిన కష్టమంతా నీటిపాలైంది. మూడెకరాల్లో వరి పంట సాగు చేశాను. రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాం. చేతికొచ్చిన పంట ఆకస్మికంగా కురిసిన వర్షానికి వరి ధాన్యం నీటిపాలు కాగా అప్పులు మిగిల్చింది. అనేక మంది రైతులు అప్పుల పాలై నష్టాలకు గురవుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య



ఆకస్మికంగా కురుస్తున్న వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి. మండలంలో 4 వేల ఎకరాలకు పైగానే వరి పంట సాగయింది. గత వారం నుంచి మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు, వడగండ్ల వానకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వ్యవసాయ అధికారులు నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించి రైతులను ఆదుకోవాలి.

రఘురామ కృష్ణంరాజు క్షమాపణ చెప్పాలి : సిపిఎం

ప్రజాశక్తి- ఆలూరు


ఆలూరులో మాట్లాడుతున్న హనుమంతు

ప్రజా ఉద్యమాల సారథి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు క్షమాపణ చెప్పాలని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి, కృష్ణ, షాకీర్, ఈరన్న, మైనా డిమాండ్ చేశారు. ఆలూరులోని జ్యోతిబసు భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తూ, సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసే సిపిఎంపై ఎమ్మెల్యే రఘురామ కృష్ణం రాజు మాట్లాడిన మాటలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని విమర్శించారు. **ఆదోని** పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల, పట్టణ కార్యదర్శులు లింగన్న, లక్ష్మన్న, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన్న, నాయకులు వెంకటేష్, బాష డిమాండ్ చేశారు. మాట్లాడారు. పేదల ఇళ్ల కూల్చివేతను తప్పు పట్టిన శ్రీనివాసరావుపై రఘురామ కృష్ణంరాజు అవమానకరంగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. అబద్ధాలు, అనుచిత వ్యాఖ్యల ద్వారా సమస్యలు పరిష్కారం కావని, చిత్తశుద్ధి ఉంటే సక్రమంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.


ఆదోనిలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

సామాజిక సేవలో పాలుపంచుకోవాలి

- లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - ఆదోని

సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకొని సమాజాభివృద్ధికి పాటుపడాలని లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్ పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ రోడ్డులోని రాయల్ ట్రేడర్స్ ముందు ఉచిత చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో ఆదోనికి వచ్చి, పోయే ప్రజలకు చల్లటి తాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ఛైర్మన్ ప్రసాదరావు, క్లబ్ ప్రెసిడెంట్ ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్ గుప్తా, విశిష్ట సభ్యులు నీల మోహన్, ఓం ప్రకాష్, వనప రాజు, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వీడని ఉత్కంఠ...

- మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికపై జాప్యం

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియ జాప్యం అవుతూనే ఉంది. దీనితో వైసిపి కౌన్సిలర్లలో ఉత్కంఠ మొదలయింది. ఆదోని మున్సిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ఈనెల 16న జరిగింది. అవిశ్వాస తీర్మానం నెగ్గి 12 రోజులు కావస్తున్నా ఇంతవరకు ఛైర్మన్ ఎన్నిక గురించి, వైస్ ఛైర్మన్‌కు ఛైర్మన్‌గా ఇన్‌ఛార్జీ ఇచ్చే విషయంలో ఎందుకు ఆలస్యం జరుగుతుందో అని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఆదోనిలో అవిశ్వాస తీర్మానం ఈనెల 16న నెగ్గితే దీనికి సంబంధించిన సభ్యుల తీర్మానాన్ని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ ప్రభుత్వానికి నివేదించారు. మున్సిపాలిటీలో పరిపాలన వ్యవహారాలకు ఇబ్బంది కలుగకుండా అవిశ్వాస తీర్మానం ప్రక్రియ ముగిసిన రెండు రోజుల్లోపు మున్సిపల్ వైస్ ఛైర్మన్‌కు ఇన్‌ఛార్జీ బాధ్యతలు వస్తాయని ఈనెల 16న అధికారులు ప్రకటించారు. ఇంతవరకు వైస్ ఛైర్మన్‌కు ఇన్‌ఛార్జీ బాధ్యతలపై కూడా ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో మెజార్టీగా ఉన్న వైసిపి కౌన్సిలర్లు అయోమయంలో ఉన్నారు. రాజకీయ జోక్యం చోటు చేసుకుందా అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని విశాఖపట్నం మేయర్ స్థానానికి ఈనెల 19న అధికార పార్టీ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఇంతలోనే విశాఖ మేయర్ ఎన్నికలు ఈనెల 28న నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈనెల 22న నోటిఫికేషన్ జారీ చేసినట్లు సమాచారం. అవిశ్వాస తీర్మానం పెట్టి వారం తిరగక ముందే అక్కడ మేయర్ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆదోనిలో మాత్రం ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి 12 రోజులు దాటినా ఇంతవరకు ఉలుకుపలుకు లేకపోవడంతో ఆదోని మున్సిపాలిటీలో చర్చ చోటుచేసుకుంది. అవిశ్వాస తీర్మానం పూర్తయిన వెంటనే వైస్ ఛైర్మన్‌ను ఇన్‌ఛార్జీగా నియమిస్తారని మరి కొన్ని రోజుల తర్వాత ఛైర్మన్‌ను ఎన్నుకుంటారని అవిశ్వాసం తీర్మానం నెగ్గిన రోజు ఎన్నికల నిర్వహణ అధికారులు పేర్కొన్నారు. ఇంతవరకు వైస్ ఛైర్మన్‌కు ఇన్‌ఛార్జీ గురించి కానీ, ఛైర్మన్ ఎన్నిక గురించి కానీ నోటిఫికేషన్ రాలేదు. వైసిపి వశమైన ఆదోని ఛైర్మన్ పీఠంపై ప్రభుత్వం ఏమైనా ప్రయోగాలు చేస్తుందా అన్న అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు. ఛైర్మన్‌గా 42వ వార్డు కౌన్సిలర్ సిహెచ్.లోకేశ్వరిని బలపరుస్తున్నట్లు కూడా వైసిపి కౌన్సిలర్లు చెబుతున్నారు. ఇప్పటికే అంతర్గతంగా అవగాహనకు వచ్చినట్లు కూడా పేర్కొంటున్నారు. ఇంతవరకు వైస్ ఛైర్మన్, ఛైర్మన్ ఎన్నిక అనేది తేల్చకపోవడంతో ఉత్కంఠ వీడడం లేదు. అటు రాష్ట్ర ప్రభుత్వం కానీ, ఇటు ఎన్నికల కమిషన్ కానీ ఆదోని మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కావడం లేదని వైసిపి నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవిశ్వాస తీర్మానంలో పదవి కోల్పోయిన ఛైర్మన్ బోయ శాంత అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నారని పదవి నుంచి దింపితే కొత్తగా ఛైర్మన్ ఎన్నిక విషయంలో ఎందుకు ఆలస్యం జరుగుతుందో అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే పట్టణంలో పరిపాలన కుంటుపడుతుందని పేర్కొంటున్నారు. విశాఖ మేయర్ ఎన్నికల మాదిరిగానే ఆదోని ఛైర్మన్ ఎన్నిక కూడా నేరుగానే జరుగుతాయని ఇన్‌ఛార్జీగా వైస్ ఛైర్మన్లను నియమించడం ఉండకపోవచ్చని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈనెల 28లోగా ఆదోని ఛైర్మన్ గిరికి ఎన్నికలు నిర్వహించడమా లేక ఇన్‌ఛార్జీ ఛైర్మన్‌గా వైస్ ఛైర్మన్‌ను నియమించడమా అనేది తేలిపోతుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.



మేడేను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - కోసిగి



కోసిగిలో 1న జరిగే మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.అంజిబాబు కోరారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మండల కార్యదర్శి రాముడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ కార్మిక చట్టాలను కాలరాస్తున్నాయని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి యాజమాన్యానికి అనుకూలంగా లేబర్ కోడ్‌లను తీసుకొచ్చాయని మండిపడ్డారు. ఈ చట్టాలు అమలయితే కార్మికులు హక్కులను కోల్పోయి యజమాన్యం దయ, దక్షిణాల మీద బతకాల్సిన పరిస్థితి దాపురిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు నష్టం కలిగించే ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు మేడే స్ఫూర్తితో పోరాడాలని కోరారు. సిఐటియు మండల నాయకులు ఐ.హెబ్సిబా రాణి, లూసమ్మ, గుర్రం వీరేష్, గోపాల్, హనుమంతు, వెంకటేష్, నరసింహులు పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైర విహారం

- బాలునిపై దాడి

ప్రజాశక్తి - నందవరం

నందవరం గ్రామంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధి కుక్కల బారిన పడి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదివారం నాలుగో తరగతి చదువుతున్న బాలుడు చాకలి హర్షవర్ధన్‌పై వీధి కుక్క దాడి చేసింది. బాలుడు తన స్నేహితులతో కలిసి ఆడుకొని ఇంటికి తిరిగి వస్తుండగా వీధి కుక్క దాడి చేసింది. దాడిలో బాలునికి గాయాలయ్యాయి. అక్కడున్న గ్రామస్తులు అడ్డుకోవడంతో బాలునికి పెద్ద అపాయం తప్పింది. ప్రథమ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వీధి కుక్కల వల్ల రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు ప్రధాన రహదారిపై ప్రయాణికులు వెళ్లాలంటే భయపడుతున్నారు. ప్రయాణికులు స్కూటర్లపై ప్రయాణిస్తున్న సమయంలో కుక్కలు దాడులు చేస్తున్నాయి. ఈ దాడిలో చాలామంది వ్యక్తులు ప్రమాదానికి గురైన సంఘటనలు ఉన్నాయి. వీధి కుక్కలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


గాయపడిన బాలుడు

మత్స్యకారుల హామీని నెరవేర్చిన బాబు

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రాఘవేంద్రరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



ఎన్నికల ముందు మత్స్యకారులకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేర్చారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. మత్స్యకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 1,29,178 మత్స్యకారుల కుటుంబాలకు రూ.259 కోట్లు విడుదల చేసి లబ్ధి చేకూర్చారని చెప్పారు. ఒక్కో మత్స్యకార కుటుంబానికి రూ.20 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో 'ఫిష్ ఆంధ్ర' పేరుతో రూ.300 కోట్లు ఖర్చు చేసినా ఒక్క మత్స్యకార కుటుంబమైనా బాగుపడిందా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధిని చూస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తోందని తెలిపారు.

కుమారుని మృతిని జీర్ణించుకోలేక తల్లి మృతి

ప్రజాశక్తి - దేవనకొండ

అనారోగ్యానికి గురైన కుమారుడు మరణించడంతో మనస్తాపానికి గురైన తల్లి అపస్మారక స్థితికి చేరుకొని కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల వివరాల మేరకు... మండలంలోని తెర్నేకల్ గ్రామంలో రెండు రోజుల క్రితం టిడిపి కార్యకర్త వడ్డే తిమ్మప్ప అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. కుమారుని మృతిని జీర్ణించుకోలేక తల్లి గౌరమ్మ (70) కుమారుడు మృతి చెందిన రోజే తీవ్ర మనస్తాపానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నారు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. ఒకరి తర్వాత ఒకరు మరణించడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వేదికలేక మరుగున క్రీడాకారులు

- మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్

ప్రజాశక్తి - ఆదోని

క్రీడా ప్రతిభ ఉన్నా ప్రదర్శించుకునేందుకు వేదిక లేక చాలామంది క్రీడాకారులు మరుగున పడ్డారని, అలాంటి వారు టోర్నమెంట్లను ఉపయోగించుకోవాలని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ మైదానంలో ఫ్రెండ్‌షిప్ కప్ టోర్నమెంట్ ఆర్గనైజర్ ముజీబ్ అహ్మద్ ఆధ్వర్యంలో టోర్నమెంట్‌ను కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్, వ్యాపారవేత్త వినోద్ జైన్‌తో కలిసి ప్రకాష్ జైన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోనిలో క్రీడాకారులకు కొదవలేదని, వారి సౌకర్యార్థం స్టేడియాలు నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇక్కడి నుంచి జాతీయ మహిళా జట్టుకు అంజలి శర్వాణి ఎంపికై రాణిస్తున్నారని చెప్పారు. ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్, కబడ్డీ క్రీడల్లో చాలామంది ప్రతిభ చూపి ఉన్నారన్నారు. వారందరికీ తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ ముజీబ్ అహ్మద్ మాట్లాడుతూ... రాజకీయ పార్టీలు, ఇతర అసోసియేషన్ల జట్లతో వారం రోజుల పాటు క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుందన్నారు. ఆదివారం జనసేన వర్సెస్ మొబైల్ అసోసియేషన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగిందని తెలిపారు. జనసేన జట్టు 10 ఓవర్లలో 68 పరుగులకు ఆలౌట్ అయిందన్నారు. అనంతరం బరిలోకి దిగిన మొబైల్ అసోసియేషన్ జట్టు 9 ఓవర్లలోనే 69 పరుగులు చేసి గెలుపొందిందని తెలిపారు. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా వినోద్ నిలిచారని చెప్పారు. అనంతరం గోల్డ్ స్మిత్ అసోసియేషన్ వర్సెస్ మెడికల్ అసోసియేషన్ జట్ల మధ్య మ్యాచ్ జరిగిందని, గోల్డ్ స్మిత్ అసోసియేషన్ జట్టు 10 ఓవర్లలో 103 పరుగులు చేసిందని తెలిపారు. అనంతరం బరిలోకి దిగిన మెడికల్ అసోసియేషన్ జట్టు 73 పరుగులకే ఆలౌట్ అయిందని చెప్పారు. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా గోల్డ్ స్మిత్ అసోసియేషన్ జట్టు క్రీడాకారుడు జాఫర్ నిలిచారని తెలిపారు. అంపైర్లుగా పొలార్డ్ బాష, ముస్తఫా, ముబీన్, ఇక్బాల్, జనసేన నాయకులు రాజశేఖర్, ఎల్లప్ప వ్యవహరించారు.


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్

భూ కబ్జాపై స్పందించని జిల్లా అధికారులు

- మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



పట్టణంలోని కలగట్ల రోడ్డులో సర్వే నెంబర్ 103బి1ఈలో మున్సిపాలిటీకి చెందిన 19 సెంట్ల స్థలం భూకబ్జాకు గురైందని, జిల్లా అధికారులు స్పందించలేదని మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్రప్రసాద్ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ స్థలం బోయ కృష్ణ అనుభవంలో ఉన్నట్లు అప్పటి తహశీల్దార్ ఆంజనేయులు సర్టిఫికెట్ ఇచ్చారని, దాన్ని అడ్డుపెట్టుకుని ఆ స్థలాన్ని మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. అప్పటి తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కుమ్మక్కై చేయించిన కబ్జా ఇదని, దొంగ రికార్డులు సృష్టించి రిజిస్ట్రేషన్ చేశారని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేయాలని తాను ఎమ్మిగనూరు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టాల్సిన పోలీసులు ముందస్తుగా అధికారులకు లేఖలు రాసి తాను చేసిన ఫిర్యాదుపై నిజానిజాలు నిగ్గు తేల్చాలని కోరారు. కలెక్టర్, సబ్ కలెక్టర్ ఎటువంటి సమాధానమూ ఇంతవరకు ఇవ్వలేదని సిఐ శ్రీనివాసులు తెలిపారని అన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని, భూకబ్జాదారులపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్, ఎస్పీని కోరినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని తెలిపారు. స్థానికంగా ఉన్న మున్సిపల్ కమిషనర్ కూడా చర్యలకు సిద్ధపడలేదన్నారు. ఇలా కిందిస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్నతాధికారులు మున్సిపల్ స్థలం కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా ఉన్నారని తెలిపారు. దాదాపు రూ.2 కోట్ల విలువ చేసే స్థలం కబ్జా చేసి దొంగ రికార్డులపై రిజిస్ట్రేషన్లు జరిపించిన అధికారులను సస్పెండ్ చేసి కేసు నమోదు చేయాలని కోరారు. కలెక్టర్ ఆ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

దేవరగట్టు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని కొత్తపేట, నెరనికి, నెరనికి తండా, కొండ గుహల్లో వెలసిన శ్రీమాల మల్లేశ్వర సన్నిధిలో ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించా రు. అర్చకులు పంపా, మహేష్ స్వాములు శ్రీమాల మల్లేశ్వరులకు బిల్వార్చన, బండారు అర్చన, అభిషేకం చేసి పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం 6 గంటల నుంచి బారులు తీరి కింద నుంచి గిరి వరకు ప్రతిమెట్టుకూ కుంకుమ బండారు అంటించారు. భక్తులకు శ్రీమాల మల్లేశ్వరుల సన్నిధిలో అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా హోళ గుంద ఎస్ఐ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మంత్రాలయంలో భక్త జన సందోహం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం భక్తజన సందోహంతో నిండిపోయింది. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలో ఉన్న వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. శ్రీరాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఆలయం చేరుకున్న భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. మఠం ప్రాకారంలో భక్తులతో సందడి నెలకొంది. స్వామివారి దర్శనార్థమై భక్తులు ప్రత్యేక వాహనాలు, బస్సుల ద్వారా అధిక సంఖ్యలో తరలిరావడంతో బస్టాండ్ దగ్గర నుంచి రాఘవేంద్ర కూడలి, శ్రీమఠం ప్రధాన ముఖద్వారం వరకు భక్తుల వాహనాలు పోటెత్తాయి. శ్రీమఠం కారిడార్ పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. ఎక్కడ చూసినా వాహనాలు నిలిచిపోయాయి. నాగలదిన్నె రోడ్డు, ఎమ్మిగనూరు రోడ్డు, రాయచూరు రోడ్లపై వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు తీవ్రంగా కృషి చేశారు.

శ్రీమఠంలో ఘనంగా అమావాస్య పూజలు

మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. అమావాస్య తిథి సందర్భంగా పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని పూజారులు నిర్మాల్యం చేసి తులసి అర్చనతో పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు చేశారు. అనంతరం స్వామి వారి మూల బృందావనాన్ని స్వర్ణ కవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీమూల రాములకు దూప, దీప, నైవేద్యాలతో మంగళ హారతులు ఇచ్చారు. ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో సంకల్పం చేయించి ఉత్సవమూర్తి శ్రీప్రహ్లాదరాయులను స్వర్ణ పల్లకి, గజ, కొయ్య, వెండి, బంగారు, నవరత్న స్వర్ణ రథోత్సవాలపై ఉంచి, మఠం ప్రాకారంలో మేళ తాళాలు, అశేష భక్తుల సమక్షంలో వైభవంగా ఊరేగించారు. ఉత్సవ మూర్తికి ఊయల సేవ చేసి మహా మంగళహారతి ఇచ్చారు. శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, ధార్మిక సిబ్బంది వ్యాసరాజాచార్, కుర్డీ జయతీర్థాచార్ పాల్గొన్నారు.


ఆలయ ప్రాంగణంలో ఉన్న భక్తులు

ఉన్నత విద్యలో రాణించాలి

- అభ్యుదయ దళిత సేవా సంఘం నాయకులు - ప్రతిభావంతులకు సన్మానం

ప్రజాశక్తి - ఆదోని


విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

పది, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి ఉన్నత విద్యలో కూడా రాణిస్తూ జీవితంలో స్థిరపడాలని అభ్యుదయ దళిత సేవా సంఘం నాయకులు కల్లుపోతుల రంగన్న, మల్లికార్జున, ఆంజనేయులు, సిఆర్.స్వామి తెలిపారు. ఆదివారం అంబేద్కర్ భవన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్, పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విద్యా ప్రతిభ అవార్డుతో సన్మానించామని తెలిపారు. ఇంటర్మీడియట్, పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించిన చాగి మహేశ్వరి ఎంపిసిలో 967, మాల రాఘవేంద్ర నాగనాథనహళ్లి గ్రామం 958, పదో తరగతిలో సాయి నందిని హెబ్బటం గ్రామం 596, మాల రుత్విక సాయి ఆదోని 581, మాల సాయి సాంకేత్ ఆదోని 585, సూర్య తేజ ఆదోని 576 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఇటీవల డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అవార్డు, యుద్ధనౌక ప్రజాకవి గద్దర్ అవార్డు, అలాగే డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం అవార్డు అందుకున్న బహుజన మీడియా ప్రతినిధి బూదూరు శ్రీనివాస్‌ను పూలమాల, శాలువాతో సన్మానించారు. వైపి.గంగాధర్, బి.బాలాజీ, కోదండ, వీరేష్, సుంకన్న, కుంకునూరు వీరేష్, వన్నూరప్ప, బొజ్జప్ప ఉన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

- డీఎస్పీ హేమలత

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ, డివైఎఫ్ఐ నాయకులు

డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, మద్యం, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలిని డీఎస్పీ హేమలత తెలిపారు. డివైఎఫ్ఐ ఆదోని పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 29, 30న పట్టణంలో నిర్వహించే 'యువ చైతన్య సైకిల్ యాత్ర' గోడపత్రికలను ఆదివారం డీఎస్పీ హేమలత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వీరేష్, నాయకులు వెంకటేష్, నవీన్, సతీష్, మోహన్ మాట్లాడారు. డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, మద్యం, గంజాయి వద్దు.. ఆరోగ్యం ముద్దు అనే నినాదంతో, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు యువ చైతన్య సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - కోసిగి

అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వారిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సిఐ భార్గవ్ రెడ్డి, ఎస్ఐ కార్తీక్ సాగర్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడారు. మండలంలోని అగసనూరు నుంచి కందుకూరు వెళ్లే దారిలో ఉన్న గురు రాఘవేంద్ర ప్రాజెక్టు వెనుక తుంగభద్ర నది నుంచి అక్రమంగా కర్ణాటక మద్యం తీసుకొస్తూ తరలించడానికి సిద్ధంగా ఉంచిన 12 బాక్సుల అక్రమ మద్యాన్ని దాడులు చేసి పట్టుకున్నామన్నారు. అగసనూరు గ్రామానికి చెందిన గొర్లి చిన్న భీమేష్, కోసిగి గ్రామానికి చెందిన బి.రామకృష్ణ అనే నిందితులను పట్టుకుని వారి వద్ద నుంచి 12 బాక్సులను 1,152 డిప్స్ (విలువ రూ.46,080) స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సిబ్బంది భరత్, ముని రంగడు, రవికుమార్ పాల్గొన్నారు.